
పైసా.. వసూల్

- వనపర్తి ఎంసీహెచ్‌లో కాన్పు కోసం వస్తే కాసులు చెల్లించాల్సిందే..
- పేషెంట్ కేర్, స్వీపర్లు, సెక్యూరిటీగార్డుల పనులకు రేట్లు ఫిక్స్
- సాధారణ ప్రసవానికి రూ.500 నుంచి రూ. 1000 దోపిడీ
- సిజేరియన్ కాన్పు జరిగితే రూ.1000 డిమాండ్
- కాన్పునకు వస్తే రూ.1500 నుంచి రూ.2,000 వరకు స్వాహా





వనపర్తి జిల్లా కేంద్రం సమీపంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రం

వనపర్తి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అదేదో సినిమాలో ప్రభుత్వాస్పత్రిలో డబ్బులు వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారని టీవీలో చూసిన హీరో జగపతిబాబు.. మారు వేషంలో తన ప్రియురాలు నొప్పులతో బాధపడుతున్నట్లు ఆ ఆస్పత్రికి తీసుకెళ్తాడు.. అక్కడ ఆస్పత్రి లోపలకు వెళ్లాలంటే అక్కడే ఉన్న కాంపౌండర్ రూ. 100 ఇవ్వాలంటాడు.. తీరా వంద సమర్పించుకుని స్ట్రెచర్ కావాలంటే మరో వ్యక్తి రూ. 200 అడుగుతాడు.. అక్కడా ఇచ్చుకుని లోపలకు వెళ్తే హెడ్ నర్సు బెడ్‌కు అయితే రూ.500, బెంచీకి అయితే రూ. 200 అని చెబుతోంది.. అక్కడా చెల్లించి.. ఆపరేషన్ థియేటర్‌కు వెళ్తుంటే రూ. 1,000 ఇవ్వాలని మరో నర్సు హుకూం జారీ చేస్తుంది. ఎందుకంటే ఇవ్వకపోతే బయట కాన్పు చేసుకోండని చెబుతుంది. ఈ దృశ్యానికి అద్దం పడుతుంది వనపర్తి జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం. ఇక్కడ ప్రతీ పనికి రేటు ఫిక్స్ చేసి మరీ దోచుకుంటున్నారు. బిడ్డ పుట్టాడానే ఆనందంలో ఎంతోకొంత ఇచ్చుకుంటున్న ప్రజలకు.. ఇంత కావాలని డిమాండ్ చేస్తుండటంతో కంగుతింటున్నారు. కొన్ని పనులకు ఎక్కువ డబ్బులు వచ్చే అవకాశం ఉండటంతో అక్కడ తమకు డ్యూటీలు వేయాలని సూపర్‌వైజర్లను ప్రాధేయపడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్రం ఊరికి బయట ఉండటం, అధికారుల దృష్టి వారిపై లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్నారు. ఒక గర్భిణి కాన్పు చేసుకుని వెళ్తే.. రూ.1,500 నుంచి రూ.2,000 వరకు సమర్పించుకోవాల్సి పరిస్థితి నెలకొంది. ఇటీవల ఒక మహిళా సెక్యూరిటీ గార్డు రూ.20 ఇస్తే తీసుకోకుండా గర్భిణి భర్త చేతుల్లో ఉన్న రూ.200 నోటును బలవంతంగా లాక్కోవడంతో సదరు బాధితులు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో ఆమెను విధులకు రానివ్వడం లేదు. ఇలా ఆమె ఒక్కరే కాదు చాలామంది పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు, స్వీపర్లు పేద ప్రజల నుంచి దోచుకుంటున్నారు. వైద్యులు మెరుగైన సేవలు అందిస్తూ.. అనేక నార్మల్ డెలవరీలతో పాటు.. ఒకేరోజు రికార్డు స్థాయిలో ప్రసవాలను చేస్తూ మంచి పేరు తెస్తున్నారు. కానీ స్వీపింగ్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డు విభాగాల్లో పనిచేసే వారు మాత్రం వైద్యుల కళ్లుగప్పి మరీ కాసులకు కక్కుర్తిపడుతున్నారు. విషయం తెలిసినా.. ఎవరూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడానికి ముందుకు రాక పోవడంతో వైద్యులు కూడా ఏం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఎక్కడైనా ఈ విభాగాల్లో ఉన్నవారికి బాలింతల కుటుంబీకులు ఎంతోకొంత చాయి ఖర్చుల కోసం సంతోషంగా ఇవ్వడం పరిపాటే. కానీ ఇక్కడ మాత్రం నియంతల్లాగ ఒక ధర ఫిక్స్ చేసుకుని అందరూ ఇస్తున్నారని చెప్పి దోచుకోవడం గమనార్హం.

ప్రతీ పనికి ఓ రేటు..

బిడ్డ పుట్టారనే సంతోషంలో ఉన్న కుటుంబీకులు ఎంతో కొంత చాయ్ ఖర్చుల కోసం అడిగితే వారు కూడా సంతోషంగానే ఇస్తారు. కానీ డిమాండ్‌లాగా మారడంతో ప్రభుత్వాస్పత్రికి వస్తున్నవారు చాలా ఇబ్బందిగా ఫీలవుతున్నారు. అడిగిన డబ్బులు ఇచ్చి వెళ్తున్నప్పటికీ, కొందరు ఫిర్యాదు చేస్తుండగా.. కొందరు వదిలేస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే డబ్బులు చెల్లించి ప్రసవాలు చేసుకోరా? అని కొందరు సిబ్బంది అంటుండటం వారి అరాచకాలకు పరాకాష్ఠగా చెప్పొచ్చు. ఇప్పుడు ఎంసీహెచ్‌లో ప్రతీ పనికీ ఓ రేటు ఫిక్స్ చేశారు. ఉదాహరణకు లేబర్ రూమ్‌లో సాధారణ ప్రసవం జరిగితే ఆడ శిశువు పుడితే రూ.500, మగ శిశువు పుడితే రూ.700 నుంచి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నారు. అదే కాన్పు సిజేరియన్ అయ్యి.. ఓటీలో జననం జరిగితే ఎవరు పుట్టినా రూ.1,000 ఇవ్వాల్సిందే. బాలింతకు డ్రెస్సు మారిస్తే రూ.200, థియేటర్ నుంచి వార్డుకు షిఫ్ట్ చేస్తే రూ.100, ప్రిపరేషన్ చేస్తే రూ.100, సర్జరీ కుట్లకు డ్రెస్సింగ్ చేస్తే రూ.100, ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతున్నప్పుడు రూ.200 చొప్పున ధరలు ఫిక్స్ చేశారు. ఎవరైనా ఇంత కంటే తక్కువగా ఇవ్వబోతే.. అందరూ తాము చెప్పినట్లుగానే ఇస్తున్నారు.. అంత ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేస్తారు. ఇదిలా ఉంటే ఆపరేషన్ థియేటర్ల వద్ద డ్యూటీ వేయించుకోవడానికి సూపర్ వైజర్లతో సిబ్బంది వాగ్వాదం పెట్టుకుంటున్నారు. అక్కడైతే ఎక్కువ డబ్బులు వసూలు చేయొచ్చనే ఆలోచనలో భాగమది. అలాగే బాలింతలను, పుట్టిన పిల్లలను చూడటానికి చాలామంది బంధువులు ఆస్పత్రికి వస్తుంటారు. వారు విజిటింగ్ సమయంలో కాకుండా ఎప్పుడైనా వెళ్లాలంటే ద్వారం వద్ద ఉండే సెక్యూరిటీకి రూ.100 చొప్పున చెల్లించాలి. లేకపోతే.. బాలింతలకు, పుట్టిన పిల్లలకు ఇన్‌ఫెక్షన్ వస్తుందని చెప్పి లోపలకు అనుమతించరు. ఇదీ వనపర్తి ఎంసీహెచ్ కేంద్రంగా జరుగుతున్న పైసా వసూల్ దందా. అధికారులు స్పందించి ఈ దందాకు చెక్ పెట్టాలని ఆస్పత్రికి వచ్చే వారు కోరుతున్నారు.

చెడ్డపేరు తెస్తున్న సిబ్బంది..

వనపర్తి జిల్లా కేంద్రానికి కొన్నేళ్ల క్రితం మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం మంజూరైంది. రూ.19 కోట్లు పైచిలుకు ఖర్చు చేసి, ఆస్పత్రిని నిర్మించారు. అయితే ఆస్పత్రి అందుబాటులోకి రావడాని కంటే ముందే.. జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు కావడంతో అప్పటివరకు ఉన్న జిల్లా ఆస్పత్రి ప్రభుత్వ జనరల్ దావాఖానాగా మారింది. అయితే మెడికల్ కాలేజీ తరగతులు మొదలు కావాలంటే 300 పడకల ఆస్పత్రి అనుబంధంగా ఉండాలనే నిబంధన ఉంది. దీంతో అటు జిల్లా ఆస్పత్రి, ఇటు ఎంసీహెచ్ రెండింటినీ అనుబంధ ఆస్పత్రులుగా చూపిస్తూ కాలేజీని ప్రారంభించారు. అప్పటివరకు ప్రసవాలు జరిగే జిల్లా ఆస్పత్రిలో కేవలం ఇతర విభాగాల సేవలు మాత్రమే అందిస్తుండగా, ఎంసీహెచ్‌లో మాత్రం కాన్పులు, పీడియాట్రిక్స్‌కు సంబంధించిన సేవలు అందుతున్నాయి. ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల నుంచి మంచి అనుభవం ఉన్న వైద్యులు వనపర్తికి వచ్చారు. సేవలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయి. ప్రసవాల్లో రికార్డులు నమోదవుతున్నాయి. వినూత్నమైన సర్జరీలు కూడా జరుగుతున్నాయి. అయితే ఆస్పత్రి నిర్వహణ కోసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో లేదా కాంట్రాక్టర్ ద్వారా నియమించిన సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండటంతో సేవలు అందిస్తున్న డాక్టర్లకు చెడ్డపేరు వస్తోంది. గ్రూపులుగా విడిపోయిన పేషెంట్ కేర్, స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది ఒకరిపై ఒకరు తగువులు పెట్టుకుంటూ.. దోపిడీకి పోటీపడుతున్నారు. వీరి వ్యవహారం వైద్యులకు, అధికారులకు రోజురోజుకూ తలనొప్పిగా మారుతోంది. చాలామంది రోగులు, గర్భిణులు, బాలింతలు ఎందుకులే ఫిర్యాదు చేయడం అని భావిస్తుండటంతో వీరు ఆడిందే ఆట.. పాడిందే పాటగా పరిస్థితి తయారైంది. గణతంత్ర వేడుకల్లో ఆస్పత్రి అధికారి ఒకరు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వస్తోందని, అలా చేస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించడం పరిస్థితికి నిదర్శనంగా చెప్పవచ్చు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనరసింహ

ఆకాంక్షల మేరకు పని చేయాలి

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

గద్వాల, జనవరి 27: ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పని చేసి, జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డితో కలిసి వైద్యం, విద్య, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీరు సక్రమంగా అందించేందుకు వీలుగా జూరాల, ఆర్డీఎస్‌తో నెట్టెంపాడు ప్రాజెక్టులలో నీరు నిల్వ ఉంచాలన్నారు. గట్టు ఎత్తిపోతల పథకం పనులు ఎంత వరకు వచ్చాయని ఆరా తీశారు. భూ సమస్యల పరిష్కారాల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ బోర్డు భూములకు రక్షణ కల్పించాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన పేదలకు వెంటనే వైద్యం అందించాలన్నారు. జిల్లాలో పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని, మౌలిక వసతులు కల్పించాలన్నారు. జోగుళాంబ అమ్మవారి సాక్షిగా చెబుతున్నానని, ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని చెప్పారు. గత ప్రభుత్వంలో తుంగభద్ర పుష్కరాల సందర్భంగా అలంపూర్‌కు వచ్చిన కేసీఆర్ రూ.100 కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేసి తీరుతామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. అలంపూర్ ఐదవ శక్తి పీఠం అమ్మవారి ఆలయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసి తీరుతుందని తేల్చిచెప్పారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్‌కుమార్, అదనపు కలెక్టర్లు చీర్ల శ్రీనివాసులు, అపూర్వ చౌహాన్ పాల్గొన్నారు. కాగా సమావేశానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరు కాలేదు.

ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తి చేయండి

గద్వాల పట్టణంలో నిర్మించిన 300 పడకల ఆస్పత్రిని మంత్రి దామోదర రాజనర్సింహ జడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పనుల వివరాలను కలెక్టర్ బీఎం సంతోష్ వివరించారు. పనులు వేగవంతం చేసి, పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఇళ్ల పట్టాల బాధితులతో మంత్రి మాట్లాడారు. ఇళ్ల పట్టాల స్థలాన్ని లాక్కొని ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు మాట్లాడుతూ ఇళ్ల పట్టాల బాధితులు హైకోర్టుకు వెళ్లారని, అధికారులు కోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చారని తెలిపారు. పట్టాదారులకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశించిందని వివరించారు. దాదాపు 1,400 మంది ఇళ్ల పట్టాల లబ్ధిదారులు ఉన్నారని, న్యాయం చేయాలని కోరగా.. అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాలను, ఆస్పత్రి నిర్మాణాలను పూర్తి చేస్తామని చెప్పారు. 300 పడకల ఆస్పత్రిని 500 పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ సరిత కోరారు. కాగా మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ ఇవ్వకూడదని ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 19ని రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. జీవో నంబర్ 317 ద్వారా తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కోరుతూ బాధిత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ వినతి పత్రం అందించారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంత్రి స్కూటీలను అందజేశారు.

మంత్రిని సత్కరించిన జడ్పీ చైర్‌పర్సన్ సరిత

కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం జడ్పీ క్యాంపు కార్యాలయానికి చేరుకున్న మంత్రిని జడ్పీ చైర్‌పర్సన్ సరిత దంపతులు ఘనంగా సత్కరించారు. తేనేటి విందు ఇచ్చారు. పలువురు నాయకులు కూడా మంత్రిని సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు ధైర్యంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శంకర్, ఇసాక్, మధుసూదన్ బాబు, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్

అనుమతి లేని అభివృద్ధి వద్దు

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ పులుల అభయారణ్యం చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా జిల్లా ఎకో-సెన్సిటివ్ కమిటీ(ఈఎస్‌జడ్) ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్, కమిటీ చైర్మన్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం ఉదయం ఐడీవోసీ సమావేశ మందిరంలో జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ఎకో సెన్సిటివ్ జోన్ నిపుణుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీలోని లైన్ డిపార్ట్‌మెంట్లు అయిన అటవీ, రెవెన్యూ, వ్యవసాయ, రోడ్లు భవనాలు, నీటి పారుదల, భూ ఖనిజాలు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. జాతీయ పులుల అభయారణ్యం సున్నిత ప్రాంతాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంత పరిధిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా కమిటీ నుంచి ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు. పులుల అభయారణ్యం చుట్టూ విస్తరించి ఉన్న రిజర్వ్ ఫారెస్టు, మిగిలిన అటవీ ప్రాంతం నుంచి పది కిలోమీటర్ల పరిధి వరకు 1986 పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించడం జరిగిందన్నారు. అమ్రాబాద్, పదరలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట, బల్మూరు, ఉప్పునుంతల, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, లింగాల మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలు ఎకో సెన్సిటివ్ ప్రాంతంలోకి వస్తాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎట్టి పరిస్థితుల్లో బ్లాస్టింగ్ చేయడానికి వీలు లేదన్నారు. రంగాపూర్ పరిధిలో రెండు, కొల్లాపూర్ పరిధిలో ఒకటి చొప్పున ఖనిజ కంపెనీలు ఉన్న విషయాన్ని మైన్స్ అధికారి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ కమిటీ అందుకు ఆమోదం తప్పనిసరి అని, లేకపోతే నిలిపివేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని మైన్స్ అధికారిని ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి, డీపీవో కృష్ణ, వెంకటేశ్వర్లు, మురళి ఉన్నారు.



అవిశ్వాస తీర్మానం నెగ్గిన తరువాత కౌన్సిలర్‌లతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

నెగ్గిన అవిశ్వాసం

- పాలమూరు పురపాలిక ఇక హస్తగతం
- ఎమ్మెల్యే సహా.. 36 మంది సభ్యులు అనుకూలంగా ఓటు
- గైర్హాజరైన 14 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌లు
- ఫలించిన ఎమ్మెల్యే యెన్నం వ్యూహం



అవిశ్వాసం సందర్భంగా మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు

మహబూబ్‌నగర్, జనవరి27: పాలమూరు పురపాలికలో అవిశ్వాస తీర్మానంపై కొద్ది రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. మునిసిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కోర్టు కేసుల ద్వారా అవిశ్వాసాన్ని అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ ముందుగా ప్రయత్నం చేసింది. ఆ తరువాత సభ్యులకు విప్ జారీ చేసింది. చివరకు గైర్హాజరు ద్వారా కోరం లేకుండా చేయాలని చేసిన ప్రయత్నాలన్నీ బెడిసి కొట్టడంతో ఎట్టకేలకు అవిశ్వాస తీర్మానం నెగ్గి.. పురపాలిక హస్తగతమైంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముందు నుంచి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ.. సభ్యుల మద్దతు కూడగట్టడంలో సఫలీకృతులయ్యారు. చైర్మన్‌గా ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను నియమించాలని నిర్ణయించిన పార్టీ, మొదటి నుంచి సీనియర్ నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, ఎం.సురేందర్‌రెడ్డిలకు ఈ బాధ్యతలను అప్పగించారు. శనివారం మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయంలో కలెక్టర్ రవి గుగులోత్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 49 మంది సభ్యులున్న పురపాలికలో అవిశ్వాసం ప్రవేశ పెట్టాలంటే 33 మంది సభ్యుల కోరం ఉండాలి. ఈ విషయమై అందరిలో టెన్షన్ నెలకొంది. కోరం లేకుండా చేసేందుకు గైర్హాజరు కావాలని బీఆర్‌ఎస్ నిర్ణయించడంతో కోరం ఉంటుందా?.. ఉండదా అన్న టెన్షన్ ఏర్పడింది. చివరకు శనివారం ఉదయం 11:07 గంటలకు కాంగ్రెస్ శిబిరంలో ఉన్న కౌన్సిలర్‌లు బస్సులో నేరుగా మునిసిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మరికొందరు వాహనాలలో వచ్చారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి 35 మంది కౌన్సిలర్‌లను తీసుకుని కౌన్సిల్ హాల్‌కు వెళ్లారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ముందుగా చైర్మన్ కోరమోని నర్సింహులుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యే సహా 36 మంది సభ్యులు అనుకూలంగా చేతులెత్తి, మద్దతు తెలుపగా అధికారులు కౌంట్ చేసి వివారాలు నమోదు చేసుకున్నారు. మధ్యాహ్నం 12:30 గంటలకు వైస్ చైర్మన్ తాటిగణేష్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. అనుకూలంగా మళ్లీ 36 మంది మద్దతు తెలపడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రకటించారు. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే వరకు కలెక్టర్ ప్రత్యేక అధికారిగా పర్యవేక్షణ చేయనున్నారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు మునిసిపల్ కార్యాలయం ముందు బందోబస్తును ఏర్పాటు చేశారు.

చైర్మన్‌ను కీలుబొమ్మలా ఆడించారు: యెన్నం

పాలమూరు పురపాలికలో చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చిందో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అవిశ్వాస తీర్మానం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నాలుగేళ్లుగా చైర్మన్‌ను కీలుబొమ్మలా చేసి, ఒకరిద్దరు నాయకులు అధికారాన్ని తమ చేతుల్లో పెట్టుకుని ఆడించారన్నారు. మునిసిపల్‌కు వచ్చిన నిధులను ఇతర పనులకు మళ్లించారన్నారు. కౌన్సిలర్‌లకు వార్డుల్లో తిరగడానికి స్వేచ్ఛ లేదన్నారు. వార్డులో ఒక రోడ్డుకు నిధులు పెట్టుకోవాలన్నా, స్ట్రీట్‌లైట్ కావాలన్నా స్వతంత్రం లేదన్నారు. అందుకే ఈ పాలనకు స్వస్తి పలకాలని అన్ని పార్టీలకు చెందిన సభ్యులు, స్వతంత్రులు 49 మందిలో 36 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటువేశారని చెప్పారు. ప్రస్తుత కౌన్సిల్‌కు ఏడాదికాలం సమయం ఉందని, ఒక మంచి చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుని పార్టీలకతీతంగా అంతా కలిసి మునిసిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాలుగేళ్లుగా అప్రజాస్వామికంగా వ్యవహరించిందన్నారు. చివరకు అవిశ్వాసాన్ని అడ్డుకునేందుకు పెద్ద పెద్ద ఆఫర్లు ఇచ్చిందని, అవేమీ ఫలించకపోవడంతో కోరం లేకుండా చేయాలన్న దుర్మార్గానికి ఒడిగట్టిందని విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు దుర్మార్గ, అరాచక పాలనను ఈ రోజుతో తుదముట్టించినందుకు కౌన్సిలర్‌లు అందరినీ అభినందిస్తున్నానని పేర్కొన్నారు.

గైర్హాజరైన సభ్యులు వీరే

పాలమూరు పురపాలికలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి బీఆర్‌ఎస్‌కు చెందిన 14 మంది సభ్యులు గైర్హాజరయ్యారు. వీరిలో కోరమోని నర్సింహులు, కోరమోని వనజ, పటేల్ ప్రవీణ్, కట్టా రవికిషన్‌రెడ్డి, మూస నరేందర్, పాతూరు శ్రీనివాస్, కిశోర్, అనంతరెడ్డి, తిరుపతమ్మ, సంధ్యా శ్రీనివాస్‌రెడ్డి, రాము, వేదవ్రత్, తాటిగణేష్, పుష్పవతి ఉన్నారు.

ఒకరికి 34 మంది తోడై..

పాలమూరు పురపాలికలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో కౌన్సిలర్ స్వప్న ఒక్కరే ఉన్నారు. ఎన్నికల ముందు బురుజు సుధాకర్‌రెడ్డి, రమాదేవి, ఆ తరువాత ఆనంద్‌కుమార్‌గౌడ్, మోయిన్‌అలీ, లతాశ్రీ పార్టీలో చేరడంతో సభ్యుల బలం ఆరుకు చేరగా, బీఆర్‌ఎస్ బలం 36కు పడిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, 36 మంది సభ్యుల బలం ఉన్న బీఆర్‌ఎస్ నుంచి 22 మంది చేజారిపోయారు. కాంగ్రెస్ ఒక్కరితో ప్రారంభించి 35 మంది మద్దతు కూడగట్టి ఏకంగా పీఠాన్ని పెకిలించడం గమనార్హం.

దొంగల బీభత్సం

చిన్నంబావి, జనవరి 27 : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం బెక్కెం గ్రామంలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో గురువారం రాత్రి బోయ గోపాల్‌కు చెందిన 70 కిలోల వడ్లను 42 సంచుల్లో ఊరు బయట మార్కెట్‌లో నిల్వ చేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గత నెలలో మండలంలోని బెక్కెం మఠం రామయ్య ఆలయంలో, అమ్మాయిపల్లి గ్రామంలోని రామాలయంలో లక్షల విలువైన ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు. అంతలోనే వెలగొండ గ్రామంలో పర్వతయ్యకు చెందిన మూడు మేకపోతులు, 13 చిన్న మేకపిల్లలను అపహరించుకుపోగా.. గతవారం రాత్రి సమయంలో పెద్దదగడలో జింకల వీరయ్య అనే రైతుకు చెందిన 46 వరి బస్తాలను కల్లంలో ఆరబోసి ఉంచగా దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే గత రెండు వారాల క్రితం గూడెం గ్రామంలోని సీతారామాలయంలో రాముడు, సీతాదేవిలకు చెందిన ఒక తులం బంగారం చోరీకి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. వరుస చోరీలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వీరయ్య తెలిపారు. వరుస ఘటనలపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

12 మంది సీఐలకు స్థాన చలనం

మహబూబ్‌నగర్, జనవరి 27 : పోలీస్‌శాఖలో బదిలీల పర్వం మొదలైంది. శుక్రవారం 21 మంది ఎస్సైలను బదిలీ చేసిన అధికారులు శనివారం జిల్లాలో 12 మంది సీఐలను బదిలీ చేశారు. జిల్లాలో భూతప్పూర్ సర్కిల్ మినహా అందరిపై బదిలీ వేటు పడింది. ఈ మేరకు ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

క్రసం	సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1	రాజేశ్వర్‌గౌడ్	డీఎస్‌బీ	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్
2	బి.భీమకుమార్	సంగారెడ్డి	వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్
3	ఏ.సైదులు	వన్‌టౌన్	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్
4	ఏ.శివకుమార్	వెయిటింగ్ ఐజీ ఆఫీస్	డీఎస్‌బీ మహబూబ్‌నగర్
5	ఏ.రమేశ్‌బాబు	జడ్చర్ల టౌన్	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్
6	కోమట్ల ఆదిరెడ్డి	డీటీసీ నల్గొండ	జడ్చర్ల టౌన్
7	కె.జములప్ప	జడ్చర్ల రూరల్	ఐజీ కార్యాలయంలో రిపోర్ట్
8	టి.నాగార్జునగౌడ్	డీఎస్‌బీ సూర్యాపేట	జడ్చర్ల రూరల్
9	బి.గాంధీనాయక్	హాలియా	మహబూబ్‌నగర్ రూరల్
10	దూలమ్ స్వామిగౌడ్	మ.నగర్ రూరల్	టూ టౌన్ మహబూబ్‌నగర్
11	ఏ.ప్రవీణ్‌కుమార్	టూటౌన్	సీసీఎస్ మహబూబ్‌నగర్
12	ఎం.బాలస్వామి	సీసీఎస్, మ.నగర్	డీటీసీ జడ్చర్ల

సినీరంగంలో రాణిస్తున్న
యాపట్ల బాలుడు


సినీ హీరో తేజసజ్జతో వికాస్

పెద్దకొత్తపల్లి, జనవరి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని యాపట్ల గ్రామానికి చెందిన వికాస్ అనే బాలుడు సినీ రంగంలో రాణిస్తున్నాడు. యాపట్ల గ్రామానికి చెందిన రాణి, కృష్ణగౌడ్‌ల కుమారుడు వికాస్ హైదరాబాద్‌లోని విజయ హైస్కూల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తేజసజ్జ హీరోగా డైరెక్టర్ ప్రశాంత్‌శర్మ కాంబినేషన్‌లో తెరకెక్కిన హనుమాన్ చిత్రంలో వికాస్ నటించాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టించింది. స్వయంభు, సార్, జగదీష్, విరూపాక్ష చిత్రాల్లో వికాస్ నటించాడు. సినిమాల్లో రాణిస్తున్న వికాస్‌ను ఆ గ్రామ సర్పంచ్ రమేష్‌రావు, ఉప సర్పంచ్ అజయ్‌కుమార్, మైనార్టీ నాయకుడు ఎండి. జహంగీర్ తదితరులు అభినందించారు.

నెగ్గని అవిశ్వాసం

పెంట్లవెల్లి, జనవరి 27 : బీఆర్ఎస్ పార్టీ సింగిల్ విండో చైర్మన్ అక్రమాలకు పాల్పడ్డారని డైరెక్టర్లు అవిశ్వాసానికి పట్టుబడడంతో 15 రోజుల క్రితం 13 మంది డైరెక్టర్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో జిల్లా కోఆపరేటివ్ అధికారి పాత్యానాయక్ ఆధ్వర్యంలో అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసానికి ఎనిమిది మంది డైరెక్టర్లు హాజరు కాలేదు. దీంతో అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కోఆపరేటివ్ అధికారి సమావేశంలో పేర్కొన్నారు. తిరిగి ఏడాది కాలం పాటు పాత చైర్మన్ విజయరామారావు చైర్మన్‌గా కొనసాగుతారని వారు పేర్కొన్నారు. మళ్లీ ఎవరూ కూడా ఏడాదిపాటు అవిశ్వాసం కోరేందుకు డైరెక్టర్లకు అవకాశం లేదని వారన్నారు.

పెద్దాపూర్ సర్పంచ్, ఉప సర్పంచ్ సస్పెన్షన్

నాగర్‌కర్నూల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం పెద్దాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కె.శిరీష, ఉప సర్పంచ్ సి.చిట్టెమ్మలను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దాపూర్ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయని గ్రామానికి చెందిన వి.నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారితో విచారణ జరిపించిన కలెక్టర్ వారికి సంజాయిషీ కోరుతూ ఈనెల 22న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ పనులకు సంబంధించి సమర్పించిన రూ.18,67,517 ఎంబీలు, బిల్లులు అభ్యంతరకరంగా ఉండడంతో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఇరువురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే అమలు చేసి వారిపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఉప్పునుంతల ఎంపీడీవోను కలెక్టర్ ఆదేశించారు.

హత్యా నేరం కేసులో సీఐ..

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 27 : హత్యా నేరం కేసులో సహకరించిన అప్పటి నాగర్‌కర్నూల్ సీఐగా పనిచేసిన జక్కుల హనుమంతును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ ఐజీ తరుణ్ జోషి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో రామాటి సత్యనారాయణ చేసిన హత్యానేరం కేసులో అప్పుడు నాగర్‌కర్నూల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న జక్కుల హనుమంతు నిందితునికి సహకరించినట్లు విచారణలో తేలడంతో అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలోని కాట్గీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హనుమంతు విధులు నిర్వహిస్తున్నారు.

గంగాపురంలో విద్యుత్ శాఖ దాడులు

జడ్చర్ల, జనవరి 27 : విద్యుత్‌చౌర్య నిరోధక శాఖ అధికారులు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపురం గ్రామంలో దాడులు నిర్వహించారు. జడ్చర్ల మండలం చెర్లపల్లి లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ గంగాపురం గ్రామంలో నివాసం ఉంటున్న లైన్‌మెన్ శ్రీనివాస్ ఇంటిపై విద్యుత్‌చౌర్య నిరోధక శాఖ అధికారులు శనివారం దాడులు చేశారు. విద్యుత్ మీటరును ఉపయోగించకుండా, సర్వీస్ వైరును నేరుగా తీసుకుని విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నాడన్న విశ్వసనీయ ఫిర్యాదు మేరకు విద్యుత్‌చౌర్య నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో విద్యుత్ మీటర్ వినియోగించకుండా, సర్వీస్ వైరును ట్యాపింగ్ చేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లుగా గుర్తించిన అధికారులు, లైన్‌మెన్‌పై కేసు నమోదు చేశారు. కాగా, ఈ అంశంపై విద్యుత్‌చౌర్య నిరోధక శాఖ డీఈని వివరణ కోరగా, గంగాపురంలో దాడులు నిర్వహించింది నిజమేనన్నారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీకి యత్నం

కొత్తకోట, జనవరి 27 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని సంకిరెడ్డిపల్లి గ్రామ శివారులోని వేణుగోపాలస్వామి ఆలయంలో గుర్తు తెలియని దొంగలు శుక్రవారం రాత్రి చోరీకి యత్నించారు. ఆలయ గర్భగుడి తాళాలు పగులగొట్టడానికి యత్నించగా అవి విరగకపోవడంతో ఆలయంలో అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి పక్కరూం తాళాలను విరగ్గొట్టి సీసీ ఫుటేజీని తీసుకెళ్లారు. శనివారం పూజలు చేయడానికి వెళ్లిన పూజారి ఆలయంలో దొంగలు పడ్డారని గుర్తించి గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. సర్పంచ్ శివరాజ్ ఆలయాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వివాహిత అదృశ్యం

భూత్పూర్, జనవరి 27 : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత(30) అదృశ్యమైంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వివాహిత ఈనెల 21న మధ్యాహ్నం ఆమె ఇంటి నుంచి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె ఆచూకీ కోసం వెతికారు. జాడ కానరాకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదనపు కట్నం కోసం భార్యను వేధించిన అత్తింటి వారిపై కేసు నమోదు

ఉప్పునుంతల, జనవరి 27 : అదనపు కట్నం కోసం భార్యను వేధించిన అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన కోనేరు స్వాతిని గత 13 ఏళ్ల క్రితం బాలానగర్ మండలంలోని చిన్నరేవల్లి గ్రామానికి చెందిన కోనేరు శేఖర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో రూ.10 లక్షల నగదు, ఐదు తులాల బంగారం, ఒక బైక్ కట్నం కింద ఇచ్చారు. వివాహమైన రెండు సంవత్సరాల వరకు వీరి సంసారం సాఫీగా సాగింది. శేఖర్ వేరే యువతితో వివాహేతర సంబంధం పెట్టుకొని అదనపు కట్నం తీసుకరావాలని స్వాతిని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. భర్తకు మద్దతుగా అత్త చెన్నమ్మ, ఆడపడుచులు అంజమ్మ, హసమ్మ, మంజుల, మరదులు మల్లేష్, వెంకటేష్ రోజు వేధిస్తున్నారు. స్వాతి ఫిర్యాదు మేరకు ఏడు మందిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

జడ్చర్ల, జనవరి 27 : జాతీయ రహదారి మహబూబ్‌నగర్ జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లి గ్రామ శివారులో లారీ బోల్తా పడింది. బెంగుళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ శుక్రవారం అర్ధరాత్రి మల్లెబోయిన్‌పల్లి మలుపు వద్ద ముందుగా వెళ్తున్న మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ప్రమాదవశాత్తు బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

శ్రీరామ జపం చేస్తోన్న బీజేపీ

» సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు దండుకోవడమే వారి లక్ష్యం
» విభజన హామీలను అమలు చేయని ఆ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదు
» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



ఆత్మకూరులోని పట్టణ వర్తక సంఘం భవనంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

ఆత్మకూరు, జనవరి 27 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు దండు కునేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం శ్రీరాముని జ పం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ దేశ ప్రజల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసే కార్పొరేట్ శక్తులకు మరింత ఆదాయం చేకూర్చే విధంగా నరేంద్రమోదీ ప్రభుత్వం చట్టాలను రూపొందిస్తుందని మండిపడ్డారు. వనపర్తి జిల్లా ఆత్మకూరులోని పట్టణ వర్తక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు రామాలయ నిర్మాణం, ప్రస్తుతం ఎన్నికల ముందు శ్రీరాముని జపంతో ఓట్లు దండుకోవడం తప్ప నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. దేశంలో కలిసిమెలసి జీవిస్తున్న ప్రజల జీవన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం మతోన్మాదంతో దేశ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించి, ఏర్పాటు అనంతరం విభజన హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు విభజన హామీలను అమలు చేయని నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఓటు ఎందుకు వేయాలని ఆయన ప్రశ్నించారు. దేశ సామాజిక, సమానత్వం కోరే ఇండియా కూటమిని ఐక్యం చేసి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీని ఓడించి ఇండియా కూటమికి ఓటు వేసే విధంగా సీపీఐ ఉధృతంగా ప్రచారం నిర్వహిస్తుందని తెలిపారు. ఇక తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ అహంకార ధోరణితో తిరస్కరించబడి పాతాళానికి పడిపోయిందన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో ఇప్పటివరకు కోటి 25 లక్షల మంది అభయహస్తం పథకానికి దరఖాస్తులు చేసుకున్నారంటే గత ప్రభుత్వ పాలన ఏ మేరకు సాగిందో ప్రజలు అర్థం చేసుకోవాలని గుర్తు చేశారు. ప్రజల అభివృద్ధి కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు సాగిస్తూనే ఉంటుందని అన్నారు. ఇండియా కూటమిలోనే ఉంటూ తెలంగాణ రాష్ట్రంలో ఐదు పార్లమెంట్ సీట్లను కోరనున్నామని తెలిపారు. ఖమ్మం, నల్గొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి సీట్లను కేటాయిస్తే సీపీఐ ఆధ్వర్యంలో గెలిపించి తీరుతామని తెలిపారు. అదేవిధంగా పాలమూరు జిల్లా వాసి అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే విధంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్ నరసింహ, కమిటీ సభ్యులు ఆనంద్‌జీ, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, కమిటీ సభ్యులు నరసింహశెట్టి, లక్ష్మీనారాయణశెట్టి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేష్, మోష, రాబర్ట్‌తో పాటు, పలువురు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన సీపీఎం నాయకులు

సీపీఎం వనపర్తి పట్టణ కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరిలు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సమక్షంలో సీపీఐలో చేరారు. సీపీఐ విధానాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరినట్లు గోపాల్, శ్రీహరి తెలిపారు. చేరిన వారికి చాడ వెంకటరెడ్డి, బాల్‌నరసింహలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితో పాటు మరో 50 మందికి పైగా పార్టీలో చేరనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు తెలిపారు.

వాగ్గేయకారులను గుర్తించడం భేష్

» దాసరి కొండప్పకు అవార్డుపై హర్షం
» అంతరించిపోతున్న కళ పునర్జీవానికి పద్మశ్రీ అవార్డు
» బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి



కొండప్పను సన్మానిస్తున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), జనవరి 27 : అంతరించిపోతున్న బుర్ర వీణ వాగ్గేయకారులను గుర్తించి కేంద్ర ప్రభుత్వం వారికి పద్మశ్రీ అవార్డును ప్రకటించడం భేష్ అని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన దాసరి కొండప్పకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించడంపై ఆయన జిల్లా ప్రజల తరుపున ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు గ్రహీత అయిన దాసరి కొండప్పను, కుటుంబ సభ్యులను శనివారం ఆయన తన స్వగృహంలో శాలువాతో సత్కరించి, రూ.25 వేల నగదు సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు అంతరించిపోతున్న బుర్ర వీణ సహాయంతో తన కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత అయిన దాసరి కొండప్పను అభినందించారు. వంశపారంపర్యంగా వస్తున్న ఈ కళను కనుమరుగు కాకుండా తన కుటుంబ పోషణ కోసం మలుచుకోవడం అంత సులభమైన పని కాదని అన్నారు. ఆయన నమ్ముకున్న కళతో జీవనం కొనసాగిస్తున్న కుటుంబాన్ని నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం గుర్తించి, ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేయడం ఆ కుటుంబం అదృష్టం అన్నారు. ఆయన నమ్ముకున్న కళనే ఆయనకు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, కిరణరెడ్డి తదితరులున్నారు.

తెలుగు భాషా ఔన్నత్యానికి అష్టావధానం ప్రతీక

» ఎస్వీ ప్రభుత్వ తెలుగు ప్రాచ్య కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ రంగాచార్యులు



పాలెం వెంకన్న ఆలయంలో అష్టావధానం నిర్వహిస్తున్న ఎస్వీ ప్రాచ్య కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ రంగాచార్యులు

బిజినేపల్లి, జనవరి 27 : ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ ఆకట్టుకునే అష్టావధానం తెలుగు భాషా ఔన్నత్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎస్వీ ప్రభుత్వ తెలుగు ప్రాచ్య కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ రంగాచార్యులు అన్నారు. మండలంలోని పాలెంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో పాలెం సుబ్బయ్య విద్యా సంస్థల వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం కళాశాల పూర్వపు విద్యార్థులతో రంగాచార్యుల అధ్యక్షతన అవధాని మద్దూరి రామమూర్తిచే అష్టావధానం నిర్వహించారు. అష్టావధానంలో అవధాని నిర్దిష్ట ఇతివృత్తాలు, రూపాలు, పదాలను ఉపయోగించి పద్యాలను తెలివిగా, అపద్యాలను మెరుగుపర్చడం ద్వారా తన ఉన్నతమైన సాహిత్య, జ్ఞాన సామర్థ్యాలను ప్రదర్శించి సాహితీ అభిమానులను అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అష్టావధానంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులతో నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకోవడమే కాకుండా తెలుగు సంస్కృతి పూర్వ విద్యార్థుల్లో ఉట్టి పడిందని సంతోషం వ్యక్తం చేశారు. అంతకు ముందు పూర్వ విద్యార్థులు తోటపల్లి సుబ్రమణ్యం శర్మ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామ పురవీధుల గుండా ప్రభాతభేరి, శోభాయాత్ర నిర్వహించారు. వెంకన్న ఆలయంలో సామూహికంగా విష్ణు సహస్ర పారాయణం చేశారు. వజ్రోత్సవాలకు విచ్చేసిన పూర్వ విద్యార్థులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ జున్న శేఖర్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వజ్రోత్సవాల కమిటీ అధ్యక్షుడు బుడ్డయ్య, కార్యదర్శులు మోహన్‌బాబు, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, జగన్‌మోహన్, వస్పరి శివుడు, డాక్టర్ మల్లికార్జున్, లక్ష్మీకాంత్, గాడి సురేందర్, గోపాలస్వామి, కాశిరెడ్డి గోపాల్‌రెడ్డి, కట్టా రవికుమార్, కృష్ణగౌడ్ తదితరులున్నారు.

ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలి

» టీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా



సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ అబ్దుల్లా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జనవరి 27 : ఉపాధ్యాయులకు శాపంగా మారిన ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్(టీఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల కార్యవర్గ సమావేశాలు మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యారంగంలో టాస్క్‌ఫోర్స్ పేరుతో పర్యవేక్షణలు పెట్టి ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం దీనిని వెంటనే రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 317 బాధితులకు న్యాయం చేసి స్వంత జిల్లాలకు పంపించాలన్నారు. ఉపాధ్యాయుల జీపీఎఫ్, పెండింగ్ బిల్లులు, ఈ-కుబేర్‌కు సంబంధించిన బిల్లులు విడుదల చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంతకుముందు ఆయా జిల్లా కమిటీలు ఉపాధ్యాయ సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆర్.రమేష్, మల్లికార్జున్, జగపతిరెడ్డి, ఫరీద్, రహమన్, రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

మట్టి పోయకుండానే
అంచులు సరి చేస్తున్నారు



ఎట్టిధార్‌పల్లి సమీపంలో బీటీ రోడ్డు వెంట అంచులకు పాత మట్టినే డోజర్‌తో సరి చేస్తున్న దృశ్యం

తాడూరు, జనవరి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామం నుంచి నాగదేవ్‌పల్లి గ్రామం వరకు దాదాపు ఎనిమిది కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును రోడ్ల భవనాల శాఖ ఆధ్వర్యంలో రెన్యువల్ చేశారు. బీటీ రోడ్డు నూతనంగా వేసిన క్రమంలో రోడ్డుకిరువైపులా మట్టితో రోడ్డును పునరుద్ధరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం కొత్త మట్టి పోయకుండానే అక్కడే రోడ్డుకు ఉన్న మట్టిని అంచులకు డోజర్ సహాయంతో మట్టి వేస్తుండడంతో చూసిన ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాంట్రాక్టర్లు ఇలా తూతూమంత్రంగా పనులు నిర్వహిస్తుండడంతో నాణ్యత లోపిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి ఐతోల్ గ్రామం నుంచి నాగదేవ్‌పల్లి వరకు వేసిన బీటీ రోడ్డుకిరువైపులా మట్టిని పోసి రోడ్డు వెడల్పు చేయాల్సిందిగా ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హోంశాఖ మంత్రి అమిత్‌షా
పాలమూరు పర్యటన వాయిదా

మహబూబ్‌నగర్ క్లాక్‌టవర్, జనవరి 27 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరగాల్సిన పార్లమెంటరీ స్థాయి క్లస్టర్ సమావేశం, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటన వాయిదా పడిందని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోంమంత్రి అమిత్‌షా అత్యవసర కార్యక్రమాలలో పాల్గొనాల్సి ఉన్నందున ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్లు, హోం మంత్రి పర్యటన, క్లస్టర్ సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

యువతను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

» కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

పాలమూరు, జనవరి 27 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువతను ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం సాయంత్రం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా ఎన్నికై మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన బల్మూరి వెంకట్‌కు పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించి, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. 31ఏళ్ల చిన్నవయసు ఉన్న తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించడంపై రాష్ట్ర ప్రభుత్వం యువతను ఎంత ప్రోత్సహిస్తోందో అర్థం చేసుకోవాలన్నారు. పెద్దల సభకు అందరికంటే చిన్నోన్ని పంపడం మర్చిపోలేని అనుభూతి నిస్తోందన్నారు. ప్రభుత్వం, యువత మధ్య వారధిగా ఎన్ఎస్‌యూఐ నాయకులు, యువత ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేయాలన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌ను అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. బీజేపీ సెంటిమెంట్‌ను రాజకీయం చేయటాన్ని ఎన్ఎస్‌యూఐ, యువత, కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆవేజ్, రాష్ట్ర కార్యదర్శి ముకుందం రమేష్, లలిత్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి బెనహర్, నాయకులు పాల్గొన్నారు.

బైక్‌పై అయోధ్యకు గద్వాలవాసి



బైక్‌పై వెళుతున్న ఆనంద్‌కు వీడ్కోలు చెబుతున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు

గద్వాల టౌన్, జనవరి 27 : అయోధ్య రామమందిరంలో కొలువైన బాలరాముడి దర్శనం కోసం స్థానిక రాఘవేంద్ర కాలనీ నివాసి, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆదెం ఆనంద్ శనివారం బైక్‌పై బయలుదేరి వెళ్లారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడు కొలువుదీరాలన్న తన చిరకాల వాంఛ నెరవేరిందన్న ఆనంద్ శ్రీరాముని ఆశీస్సులతో అందరూ సుఖశాంతులతో ఉండాలన్నారు. మల్దకల్ మండలం మద్దలబండకు చెందిన మిత్రుడు నాగరాజుతో కలిసి అయోధ్యకు బయలుదేరుతున్న ఆనంద్ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి కాలనీలోని శ్రీసత్యనారాయణస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం తన తల్లి పాదాలకు నమస్కరించి బయలుదేరారు. ఆయన చేపట్టిన యాత్ర విజయవంతం కావాలని మిత్రులు ఆకాంక్షించారు.

ఇంటర్‌లో వందశాతం ఫలితాలు సాధించాలి

» డీఐఈవో డా.శ్రీధర్‌సుమన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 27 : ఇంటర్మీడియట్‌లో వందశాతం ఫలితాలు సాధించేలా అందరు కృషి చేయాలని డీఐఈవో డా.శ్రీధర్‌సుమన్ అన్నారు. శనివారం జిల్లా ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో డీఐఈవో చాంబర్‌లో డీఐఈవో శ్రీధర్‌సుమన్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు, వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారి జగన్, ఉపాధ్యక్షుడు సురేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు జహీర్‌అక్తర్ తదితరులున్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు కొండాపూర్ విద్యార్థి



మహేశ్

ధన్వాడ, జనవరి 27 : నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థి మహేశ్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో విద్యార్థి పాల్గొంటున్నట్లు ఆయన చెప్పారు. గత నెలలో నాగార్జునసాగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మహేశ్ ప్రతిభ కనబర్చాడన్నారు. ఆ పోటీల్లో నారాయణపేట జిల్లా జట్టుకు బంగారు పతకం సాధించడంలో మహేశ్ కీలక పాత్ర పోషించాడన్నారు. ఎంపికైన విద్యార్థి మహేశ్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ సురేశ్‌రావు, నాగమణి, పూజారి ఎల్లేష్, ఫిజికల్ డైరెక్టర్, కోచ్ రాంమోహన్‌గౌడ్‌లు అభినందించారు.

ఒకటిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 27 : ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో సీనియర్స్ జట్ల ఎంపికలు ఫిబ్రవరి 1న నారాయణపేట జిల్లా దామరగిద్ద తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఒబేదుల్లా కొత్వాల్, విలియంలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ ఎంపికల కోసం 80746 22253, 86390 91977ను సంప్రదించాలని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన జట్టు ఫిబ్రవరి తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు భువనగిరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

సీపీఎం నుంచి శ్రీహరి, గోపాలకృష్ణల బహిష్కరణ

ఆత్మకూరు, జనవరి 27 : సీపీఎం నుంచి శ్రీహరి, గోపాలకృష్ణలను బహిష్కరించినట్లు సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శి జబ్బార్, కార్యదర్శివర్గ సభ్యుడు జీఎస్.గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వారిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు వారు తెలిపారు. రెండు సంవత్సరాలుగా పార్టీ నిర్మాణంలో ముఠాలు కట్టే స్వభావంతో పార్టీ విచ్ఛిన్నానికి కుట్ర చేస్తున్నారని తెలిపారు. భిన్నమైన పద్ధతులతో పార్టీ విచ్ఛిన్నానికి పాల్పడరాదని పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోకపోవడంతో ఇరువురిని బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

సీవీ రామన్ ఒలంపియాడ్ ప్రతిభ పరీక్ష

నారాయణపేట, జనవరి 27 : సుచిరిండియా ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నారాయణపేట శ్రీసాయి స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు శనివారం 31వ సీవీ రామన్ ఒలంపియాడ్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు 85 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు జిల్లా స్థాయిలో బహుమతులను హైదరాబాద్ రవీంద్ర భారతిలో అందించనున్నారు. ఇలాంటి పరీక్షలతో విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటు ఓఎంఆర్ షీట్ గురించి అవగాహన కలుగుతోందని నిర్వాహకులు సాయిలీల తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలప్ప, ఉపాధ్యాయులు అమీన, నరసింహ, సురేందర్ పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటుతో మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి అచ్చంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో గుండెపోటుతో ఓ మహిళ మృతి చెందింది. ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ వద్ద నాగర్‌కర్నూల్ నుంచి అచ్చంపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో బంగారమ్మ(42) అనే మహిళ బస్సు ఎక్కింది. బస్సు నాగర్‌కర్నూల్ బస్ డిపో వద్దకు వెళ్లేసరికి బంగారమ్మ తీవ్ర గుండెనొప్పితో కింద పడిపోయింది. డ్రైవర్ వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి మళ్లించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా తెలకపల్లి మండలం జిన్‌కుంటకు చెందిన బంగారమ్మగా గుర్తించి, ఆ గ్రామవాసులకు సమాచారమందించారు. మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచారు.

తిల తైలాలతో శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జనవరి 27 : జేష్ఠాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తులు తిల తైల అభిషేకాలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వర పరమశివుని వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. పూజారులు ఉమామహేశ్వరం, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖాదర్‌పాషా దర్గా ఉర్సు ప్రారంభం


ఉర్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కౌన్సిలర్లు

కొల్లాపూర్, జనవరి 27 : కొల్లాపూర్ పట్టణంలో మత సామరస్యాలకు ప్రతీకగా నిలిచిన ఖాదర్‌పాషా దర్గా ఉర్సు ఆదివారం నుంచి ప్రారంభమై మూడు రోజుల పాటు ఘనంగా కొనసాగనున్నాయి. శనివారం ఖాదర్‌పాషా దర్గా ఉర్సు ఏర్పాట్లను మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ మహెమూదాబేగం, కౌన్సిలర్లు, సిబ్బంది నరసింహారావు, షేక్.రహీంపాషా, ఎండీ నయీమ్, బరిగెల రాముడు, కమిషనర్ సొంటె రాజయ్యలు పర్యవేక్షించారు. జిల్లా నలుమూలల నుంచి ఉర్సుకు హాజరయ్యే భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేసేలా ఏర్పాట్లు నిర్వహించారు. దర్గా పరిసర ప్రాంతాలను మునిసిపల్ సిబ్బందిచే శుభ్రం చేయించారు. ఈ నెల 29వ తేదీ ఉర్సుకు తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నట్లు కౌన్సిలర్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణమనాయుడు, బరిగెల వేణుగోపాల్‌యాదవ్, దిలీప్‌శెట్టి, ఖాదర్‌పాషా, ఎండి.తాహేర్‌పాషా, సోఫీ, వెంకటయ్య, అన్వర్, ఆరీఫ్, చిన్నకుర్మయ్య, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల కోసం మైనింగ్ అధికారుల పరిశీలన

తాడూరు, జనవరి 27 : తాడూరు మండలంలోని దుందుభీ నది పరివాహక ప్రాంత గ్రామాల్లో మైనింగ్ అధికారులు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయడం కోసం ఆయా గ్రామాల్లో దుందుభీ నది శనివారం పరిశీలించారు. ఈ క్రమంలో గ్రామాల్లోని ప్రజలు దుందుభీ నదిలో ఇసుక రీచ్‌కు అనుమతి ఇవ్వద్దంటూ గ్రామపంచాయతీ తీర్మానంతో గ్రామాల్లోని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ కార్యకలాపాల కోసం ప్రైవేట్ ఇళ్ల నిర్మాణాలు తదితర అవసరాల కోసం ఇసుక తప్పనిసరి అయినందున ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతానికి తాడూరు మండలంలోని పొల్మూరు గ్రామంలో శాండ్ ట్యాక్సీలో భాగంగా ఇసుక రీచ్‌లు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే శనివారం తాడూరు మండలం పాపగల్ గ్రామంలో రీచ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తుండగా గ్రామస్థులు మా గ్రామంలో ఇసుక రీచ్‌లు వద్దంటూ వ్యతిరేకించారు. ఏదేమైనా అవసరాల దృష్ట్యా ఇసుక రీచ్‌లకు తప్పనిసరిగా సహకరించాల్సి ఉంటుందని మైనింగ్ అధికారులు సూచించారు. మైనింగ్ అధికారులు జ్ఞానేశ్వర్, ఆర్ఐ గోపాలకృష్ణ, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

'ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలి'

తిమ్మాజిపేట, జనవరి 27 : 2024-25సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పలు శాఖల అధికారులు ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి ప్రతిపాదనలు తనకు అందజేస్తే జిల్లా అధికారులకు పంపించి నిధులు మంజూరయ్యేలా చూస్తానని ఎంపీడీవో కరుణశ్రీ అన్నారు. ఎంపీటీసీ సభ్యులు లీలావతి, భాగ్యమ్మ, శారద, మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, ఏపీఎం శ్రీహరి, మిషన్ భగీరథ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి


అమ్రాబాద్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి

అమ్రాబాద్, జనవరి 27: ఈ వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ద్వారా విద్యా బోధన చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహమ్మద్ షర్ఫుద్దీన్ అన్నారు. శనివారం అమ్రాబాద్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మ్యాథమెటిక్స్ సమస్యలను విద్యార్థులు ఏ విధంగా సాల్వ్ చేస్తున్నారు.. అన్న విషయంపైన ఆయన స్వయంగా కొన్ని ప్రశ్నలు ఇచ్చి వారి నుంచి జవాబులు రాబట్టారు. ఈ విద్యార్థులకు ఇంకా మెరుగైన తర్ఫీద్ ఇవ్వాలని సూచించారు. జెండర్ కోఆర్డినేటర్ సూర్య చైతన్య మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిషన్ సీఆర్‌పీ స్వరూప ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నల్లవెల్లి యశ్వంత్


బల్మూరి వెంకట్‌తో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన నల్లవెల్లి యశ్వంత్

అమ్రాబాద్ జనవరి 27: ఎన్‌ఎస్‌యూఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అమ్రాబాద్ మండలం మన్ననూర్‌కు చెందిన నల్లవెల్లి యశ్వంత్ నియమితులయ్యారు. శనివారం ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, నుంచి ఈ నియామక ఉత్తర్వులు వచ్చినట్లు యశ్వంత్ స్థానిక విలేకరులకు తెలిపారు. జిల్లా ఎన్‌ఎస్‌యూఐ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియామకానికి సహకరించిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు శాసనసభ్యుడు డాక్టర్ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి శాసనసభ్యులు రాజేష్ రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డిలకు యశ్వంత్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి శివస్వాములకు అన్నప్రసాదం పంపిణీ

కందనూలు, జనవరి 27 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఆకారపు వంశీయుల సహకారంతో గత ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని స్వీకరించిన శివదీక్ష మండల, అర్థమండల శివ దీక్షా స్వాములకు ఆదివారం నుంచి మహాశివరాత్రి వరకు అన్నప్రసాద కార్యక్రమం చేపడుతున్నట్లు ఆకారపు అన్నప్రసాద కమిటీ సభ్యులు ఆకారపు శంకరయ్య, విష్ణు, మెడికల్ శ్రీనాథ్‌లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని పోస్టాఫీస్ ఎదురుగా గల ఆకారపు వారి శివాలయంలో ప్రతిరోజు మధ్యాహ్నం అన్నప్రసాద పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి, జనవరి 27 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాలనీ మధ్యలో రహదారిపై ఉన్న కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా పొంచి ఉండడంతో ఆ కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో గత కొన్నేళ్ల క్రితం అంతర్గత రహదారిపై ట్రాన్స్‌ఫార్మర్ రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి రహదారి మధ్యలో అడ్డంగా ఉండడంతో ఆ కాలనీ వాసుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుంది. ఇనుప స్తంభాలు కావడం వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ఆ కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు, విద్యార్థులు, ప్రజలు, పశువులు, గేదెలు ఆ రహదారి వెంట ఆదమరిచి వెళ్తే ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారిపై అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని ఎన్నోమార్లు సంబంధిత శాఖ అధికారులకు ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రహదారిపై అడ్డంగా ఉన్న స్తంభాలను తొలగించి వేరేచోట ఏర్పాటు చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

● స్తంభాలను తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలి



కల్వకోల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రహదారిపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలి. రహదారిపై స్తంభాలు అడ్డంగా ఉండడం వలన ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. స్తంభాలను తొలగించి వేరేచోట ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి.

- పెబ్బేటి శంకర్, కల్వకోల్


కల్వకోల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రహదారిపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

మాదకద్రవ్యాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్


పోలీస్ శాఖ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

నాగర్‌కర్నూల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మాదక ద్రవ్యాల కట్టడికి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఉదయం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అన్ని విద్యా సంస్థల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌లో కమిటీలు ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వడమే కాకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు డ్రగ్స్ విషయంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిఘా పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులును ఆదేశించారు. తెలంగాణ సాంస్కృతిక కళా బృందం, పోలీస్ కళా బృందంతో కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో వచ్చే కేసుల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చిన కేసులను రికార్డు చేయాలని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మెడికల్ షాపుల్లో మత్తు పదార్థాల విక్రయంపై పర్యవేక్షణ ఉండాలని వైద్యాధికారి రవినాయక్‌ను ఆదేశించారు. మాదక ద్రవ్యాల విషయంలో అటవీ ప్రాంతంలో నిఘా పెట్టాలని, వ్యవసాయ పొలాల్లో గంజాయి సాగు ఏమైనా జరుగుతుందా అనే దానిపై వ్యవసాయ విస్తీర్ణాధికారులు నివేదికలు ఇవ్వాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు.

మాదక ద్రవ్యాల కట్టడి కోసం ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్ ఎల్‌బీ.కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి, డీఈవో గోవిందరాజులు, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యశాఖ నుంచి ఇమ్యూనైజేషన్ అధికారి రవినాయక్, డీఎస్పీ బి.మోహన్‌కుమార్, అచ్చంపేట సీఐ కృష్ణకిశోర్, కల్వకుర్తి నుంచి పార్థసారథి, నాగర్‌కర్నూల్ నుంచి నర్సింహులు, ఎక్సైజ్ శాఖ నుంచి బి.సుధాకర్, డీపీవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


తోటపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జనవరి 27 : అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని, రైతువేదిక, సీసీ రోడ్డు , అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ పసుల శ్రీలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కశిరెడ్డి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో తూచ తప్పకుండా అమలు పరుస్తామని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సినవసరం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన రోజే రెండు గ్యారెంటీలను అమలుపర్చామని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సహకారంతో కావాల్సిన నిధులు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న కేఎల్ఐని పూర్తి చేయించి రైతులకు సాగునీరందించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను దశల వారిగా అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పసుల రాజేష్‌రెడ్డి, పసుల హనుమంతురెడ్డి, జిల్లెల రాములు, దామోదర్‌గౌడ్, లింగమయ్య, రామకృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ నరేష్, గ్రామ కార్యదర్శి లింగం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం కావాలి

- జిల్లా విద్యాధికారి గోవిందరాజులు
- ఎస్సీ, బీసీ వసతి గృహ విద్యార్థులకు పది పరీక్షలపై అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 27: విద్యార్థుల ప్రణాళికతో పది పరీక్షలకు సన్నద్ధం అయితే విజయం సాధ్యమని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుఖజీవన్‌రెడ్డి ఫంక్షన్‌హాలులో ఎస్సీ, బీసీ సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పదో తరగతి వసతిగృహ విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి గోవిందరాజులుతో పాటు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరై పది పరీక్షల విజయం సాధించేందుకు కావాల్సిన మెలుకులు, ప్రేరణ కలిపించారు. ఈ సందర్భంగా డీఈవో గోవిందరాజులు మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల సమయం దగ్గర పడిందని, ఇంకా 45 రోజుల్లో ఉన్నందున సమయాన్ని వృధా చేయకుండా ప్రతిరోజు ప్రణాళికతో చదవాలని సూచించారు. సబ్జెక్టుల వారికి సదవడంతో పాటు రైటింగ్ ప్రాక్టీస్ చేయాలన్నారు. ఈ ఏడాది జిల్లాలో 10,500 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 2తో ముగియనున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి జంకు లేకుండా పరీక్షలు రాసేలా సన్నద్ధం చేసేందుకు 'లక్ష్య' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. హాస్టల్స్ వార్డెన్లు, ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టి 10 జీపీ మార్కులు సాధించేలా కృషి చేసి జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలబెట్టాలని కోరారు. జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి రాంలాల్, బీసీ సంక్షేమశాఖ అధికారి శ్రీధర్‌జీ, డీఆర్‌డీవో నర్సింగరావు, ఉపాధ్యాయులు ఆనంద్‌ప్రసాద్, జహీరుద్దీన్, చంద్రమోహన్‌రెడ్డి, మల్లయ్య, ఎస్సీ, బీసీ వసతి గృహాల హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 27: మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు.

శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మారేడు శివశంకర్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రతి నెల రూ.15 వేలు ఇవ్వడంతో పాటు ఆటో కార్మికులకు తక్షణమే ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నపాగ శ్రీనివాసులు, నాయకులు వాడాల బాలపీరు, ఆటో కార్మికులు ఎండీ.రజాక్, రాజు, నాగేంద్రగౌడ్, రాజు, శివ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 27: మాదిగ విద్యార్థి సమాఖ్య(ఎంఎస్‌ఎఫ్) జిల్లా నూతన కార్యవర్గం ఏర్పడింది. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొయ్యల భరత్‌మాదిగ, ప్రధాన కార్యదర్శిగా అర్కల రమేష్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా చింతకుంట్ల కుమార్ మాదిగ, సహాయ కార్యదర్శిగా మహాత్మస్వామి మాదిగలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాట్లాడుతూ మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్రంలో మాదిగ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు


పల్లె దవాఖానకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

కందనూలు, జనవరి 27 : నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలు ప్రారంభించారు. తూడుకుర్తి గ్రామంలో నూతన గ్రామపంచాయతీని, పల్లె దవాఖానకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్


సీఎం రేవంత్‌రెడ్డిని శాలువాతో సన్మానించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్

చారకొండ, జనవరి 27: రాష్ట్ర అభివృద్ధి కోసం దావోస్ పర్యటను విజయవంతంగా ముగించుకొని వచ్చిన సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చారకొండ మండల కేంద్రానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చారకొండ వెంకటేష్ శనివారం కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

4న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం

తిమ్మాజిపేట, జనవరి 27: తిమ్మాజిపేట మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా నాల్గవ విస్తృత స్థాయి సమావేశాలను ఫిబ్రవరి నాలుగున నిర్వహిస్తున్నామని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్‌శర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, అదేవిధంగా జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని సీపీఎస్ విధానం రద్దు చేయాలన్న డిమాండ్లతో కూడిన సమస్యలను చర్చించడం జరుగుతుందన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం వజ్రోత్సవాలు అదే రోజు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత

తిమ్మాజిపేట, జనవరి 27 : తిమ్మాజిపేట మండల పరిధిలోని బుద్దసముద్రం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు శనివారం మండల యువజన కాంగ్రెస్ వర్కింగ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తన తండ్రి చేతుల మీదుగా ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివేది నిరుపేద విద్యార్థులని వారికి ఏదో చేయాలన్న తపన తనలో ఉందని ప్రతి ఏటా ఇదే తరహాలో సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.

కష్టపడి చదువుకోవాలి


విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న జీజేసీ ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, హ్యూమానిటీ సొసైటీ సభ్యులు

కల్వకుర్తి, జనవరి 27 : విద్యార్థులు లక్ష్యంతో కష్టపడి చదువుకోవాలని కల్వకుర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, హ్యూమానిటీ సొసైటీ సభ్యులు కోరారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విజేతలకు శనివారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జీజేసీ ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీవీని హ్యూమానిటీ సొసైటీ సభ్యులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంకు అందజేశారు. హ్యూమానిటీ సొసైటీ సభ్యులు రమేష్‌యాదవ్, ఆంజనేయులు, ఖయూమ్, బంగారీ, మంజుల, ఆస్రాయి, రమేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారుల మండల కమిటీ ఎన్నిక

బిజినేపల్లి, జనవరి 27 : మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు వంగ శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు శనివారం జానపద కళాకారుల మండల కమిటీ ఎన్నుకున్నట్లు నూతన కమిటీ అధ్యక్షుడు నరిగే నరేందర్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి రెడ్డి, సహాయ కార్యదర్శిగా శివాని, కోశాధికారిగా అల్లాజీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మైక్‌సెట్ అందజేత

కల్వకుర్తి, జనవరి 27 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న శ్రీనివాస్, పదవ తరగతి మిత్ర బృందం సభ్యులు సమకూర్చిన మైక్‌సెట్‌ను కళాశాలకు శనివారం బహూకరించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఓపెన్ ఐస్ సొసైటీ సమకూర్చిన మైక్‌సెట్‌ను ప్రిన్సిపాల్ శర్వాణికి అందజేశారు. మైక్‌సెట్ అందించడానికి దోహదపడ్డ అధ్యాపకుడు శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు.

కొల్లాపూర్ సీఐ బదిలీ

కొల్లాపూర్, జనవరి 27 : కొల్లాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న యాలాద్రిని ఐజీ కార్యాలయానికి బదిలీ చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొల్లాపూర్ సీఐగా సూర్యాపేట నుంచి కే.మహేష్‌కు పోస్టింగ్ ఇచ్చారు. మరో రెండు రోజుల్లో కే.మహేష్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టను న్నారు.

మాదక ద్రవ్యాల వాడకంతో మానవాళికి ముప్పు

తెలకపల్లి, జనవరి 27 : మాదక ద్రవ్యాలతో మానవాళికి ముఖ్యంగా యువతకు ఎంతో నష్టం వాటిల్లుతుందని వాటికి దూరంగా ఉండాలని ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యా సంస్థలో కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఎల్ఆర్.విద్యా సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం.ప్రకాశ్‌రెడ్డి, ఎస్.సందీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

తెలకపల్లి, జనవరి 27 :తెలకపల్లి మండల పరిధిలోని పెద్దపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య మాట్లాడుతూ షీటీం పనితీరును వివరించి షీటీంను ఎలా అప్రోచ్ చేయాలో సూచించారు. సోషల్ మీడియాలో ఎలాంటి ఫొటోలు, వీడియోలను పోస్టు చేయవద్దని, మీ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని, తల్లిదండ్రులు మీ గురించి గర్వపడేలా చేయాలని, బాల్యవివాహాలు చేయకూడదని, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌గురించి అవగాహన కల్పించారు. షీటీం సభ్యులు వెంకట్‌నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.